గొల్లపూడి కాలమ్

## నేలమీద చందమామ

నా మట్టుకు నాకు వీరప్పన్ చచ్చిపోయాడనగానే చాలా విచారం కలిగింది. 30 సంవత్సరాల పంచరంగుల సినీమా హఠాత్తుగా వూరి చివరి టెంటు హాలులో నేలబారు కథగా మారిపోయిన ట్టనిపించింది.

ఒకాయన నన్నడిగాడు:'అదేమిటండీ- ఆయన నిజంగా వీరప్పనేనా?'అని.

ఆయన దృష్టిలో వీరప్పన్-చక్కగా గుబురుగా పెరిగిన బుగ్గమీసాలతో, సూర్య నమస్కారాలు చేస్తూ, కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ గారికి భగవద్గీత సారాన్ని చెప్పేవాడుగా దర్శనమిస్తున్నాడు. ఒక కన్ను లోతుకుపోయి,నుదుటి మీద బుల్లెట్ రంధ్రంతో,మీసాల్లేని నేలబారు శరీరాన్ని 'వీరప్పన్'గా ఒప్పుకోవడాన్ని ఆయన మనస్సు ఒప్పుకోలేదు.

అసలు ఈ తరం మానవాళి రెండు గొప్ప కలల్ని నష్టపోయింది. ఏనాడో- 550 సంవత్సరాల క్రిందట అన్నమయ్య 'చందమామ రావే!' అని పిలిస్తే- కొన్ని తరాల తల్లులు తమ బిడ్డలకి అన్న ం తినిపిస్తూ చందమామని రమ్మనే అందమైన కల ఈ తరంలోనే కూలిపోయింది. అది ఓ చల్లటి మంచుముద్ద అనీ, అక్కడ మనుషులు నేల మోపి, అమెరికా జెండా పాతివచ్చాక ఆ చందమామని రమ్మని పిలవాలని మనస్సు ఒప్పుకోవడంలేదు.

పోనీ, మరో కవి ఎవరయినా- అన్నమయ్య అంతటి వాగ్గేయకారుడు పుణ్యం కట్టుకుంటే- శుక్ర తాతా రావే!' అనో, 'అంగారక బావా రావా!' అనో కొన్ని తరాలు పాడుకో వచ్చు.

అలాగే వీరప్పన్ గురించి చాలా కథలు విన్నాం. ఆశ్చర్యపోయాం. రెండు ప్రభుత్వాల బలగాలను 30 సంవత్సరాలు ఆటపటించి కొన్ని వేల ఏనుగుల్ని లొంగదీసిన మాహానుభావుడు- చాలా మంది దృష్టిలో పప్పూ యాదవ్‌కన్నా, అరుణ్‌గౌలీ కన్నా, టైగర్ మెమూన్ కన్నా,దావూద్ ఇబ్రహీం కన్నా- గ్లామరస్‌గా కనిపించే వాడు.

దాదాపు 45 సంవత్సరాల క్రిందట – తాజ్ మహల్ ని చూసినప్పుడు నేనలా క్రుంగిపోయాను. నా మనస్సులో వున్న తాజ్ మహల్ కీ, ఎదురుగా వున్న 400 సంవస్తరాలు పాతబడిన తజ్‌మహల్ కీ బొత్తిగా పోలిక లేకుండా పోయింది.ఇప్పుడిప్పుడు మాయావతిలాంటి నాయకుల ధర్మమాంటూ ఇంకా పాడుబడిందని చెప్పుకొంటున్నారు. ఏమయినా తాజ్‌మహల్‌ని చూడాలనే ఉత్సాహం నాలో ఇప్పుడు ఏ కోశానా లేదు.

అలాగే వీరప్పన్ గ్లామరు గత 24 గంటల్లో నాలో నీరుకారిపోయింది.

ఊహ కొన్నింటిని అందంగా అలంకరిస్తుంది. Larger than life గా చేసి మన మనస్సుల్లో నిలుపుతుంది. వాస్తవం దాన్ని వెక్కిరిస్తుంది. ఆ అలంకారాన్ని చెరిపేస్తుంది.

'చిత్రాల్ని దగ్గరగా చూడకు, కంపు కొడతాయి' అన్నాడు ప్రముఖ చిత్రకారుడు రెంబ్రాంట్.

హిట్లర్ చక్కెర వ్యాధి గురించీ,నెపోలియన్ జీడిపప్పు మీద మక్కువను గురించీ విన్నప్పుడు– ఆ వ్యక్తులు మన ఊహల స్థాయి నుంచి నేల మీదికి  జారిపోతారు.

'నాథూరాం గోడ్సే దుర్మార్గుడు' అనే ఆలోచనని ప్రజలకి చెడగొట్టే హక్కు ఎవరికీ లేదు.

అలాగే మహాత్ముడు మామూలు మనిషి అని ఎవరూ పనికట్టుకుని ప్రచారం చెయ్యనక్కరలేదు.

నేను చందమామ, తాజ్‌మహల్,నెపోలియన్, హిట్లర్, రావణాసిరుడు కోవలో ఏ చివరనో వీరప్పన్ నిలుస్తాడంటాను.

మా సినీమా వారు ఈ గ్లామర్‌ని తెరమీదకిలాగే ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది. నెగిటివ్ పాపులారిటీని పాజిటివ్ వ్యాపారంగా తర్జుమా చెయ్యడంలో వారికి వారే సాటి.

'బందిపోటుల్నీ, హంతకుల్నీ హీరోల్ని చేసే పని సినీమాలు చెయ్యనక్కరలేదు' అన్నారు రాజ్‌కుమార్.

అయితే జాన్ ది రిప్పర్‌నీ,ఫూలన్ దేవినీ ఆదర్శప్రాయాలుగా ఝాన్సీ రాణీ, సుభాష్ చంద్ర బోస్ స్థాయిని నిలపగలిగిన మీడియాకి– ఈ మాట రుచించదని నాకు తెలుసు.

నాయకులు వోటు బ్యాంకుల్ని వెదుక్కొంటారు. సినీమాలవారు నోటు బ్యాంకుల్ని వెదుక్కొంటారు. భరించడం తప మనకి వేరే గత్యంతరం లేదు.

(రచయితనిwww.gollapudimaruthirao.com లో కలుసుకొన వచ్చును)